
"నీ పూజారి అన్నయ్యేమీ లక్షాధికారి కాదు శారదా! దినదినగండము నూరేళ్ళాయుష్షుగా వుంది సంసారం. విలువైన కానుకలతో నిన్ను సాగనంపాలంటే మాత్రం నాచేతకాదు" బాధగా, వ్యంగ్యంగానే అన్నాడు అన్నయ్య.

అన్నయ్య విలువైన కానుకలిచ్చే స్థితిలో లేడని నాకు తెలుసు. కానీ భగవద్దత్తమైన యీ పవిత్ర భాతృబంధం తాలూకు స్మృతి చిహ్నంగా ఏదైనా ఒక అమూల్యమైన కానుకను అన్నయ్య నుంచి పొందే హక్కు నాకు ఉంది. ఈ హక్కును ఆయన సంకుచిత పరచడము నాకు నచ్చలేదు. అందుకే అన్నాను.

"చెల్లెండ్రకు సారెలియ్యడానికి లక్షాధికారులే కావాలాయేం? హృదయంలో ప్రేమ వుంటే..."

"భిక్షాధికారైనా ఇస్తాడంటావు. అంతేనా? అసలు హృదయములో ప్రేమేది? ఎందుకుండాలి? నీవేమీ నా సొంత చెల్లివి గనుకనా ప్రేమ వుండడానికి?"

నేనాయన సొంత చెల్లిని కాదని అందరకూ తెలుసు. అందరికంటే ఎక్కువ ప్రేమతో పెంచాననే ఆయన అహంభావమే యిలాంటి అనేక



# అసలు ఫాయిదాలు

సమయాల్లో నన్ను నిరుత్తరురాల్ని చేసింది. కాని యీనాడది ఓడిపోయింది.

"ఇంతవరకూ యింత అప్యాయత, ఆదరణ యీ అరువు చెల్లెలిపైన ఎందుకు ఒలక బోయాలి? ఇదంతా వట్టి నటనేననే విషయాన్ని ఈ రోజువరకూ ఎందుకు దాచిపెట్టాలి?" అన్నాను ఉక్రోషంతో.

ఎదురుచూడని యీ జవాబుకు ఆయన క్షణకాలము నివ్వెరపోయారు. తమాయించుకొని అన్నారు.

"అవునే శారదా! ఇదంతా నటనకాక మరేమనుకున్నావు? ఉన్న కాస్తభూమినీ కుదువపెట్టి నీ పెండ్లికి కానుకగా యిచ్చింది నీ అన్నగా నటించాలని కదూ? అది అట్లా వుంచు. టైఫాయిడ్ తల్లి వెచ్చని కౌగిలిలో మూసినకన్ను తెరవకుండా నీవు చావు బ్రతుకుల సరిహద్దులు నిర్ణయిస్తుంటే, తెరిచినకన్ను మూయకుండా 20 రోజులు నటించా - జ్ఞాపకముందా?"

జ్ఞాపకము లేకేమి? ఆయన చెప్పినదాంట్లో ఒక్క అక్షరముగూడ పొరపాటులేదు, మా సొంత అన్నయ్యే రెండురోజుల కంటే ఎక్కువ వుండలేకపొయ్యాడు. నిరంతరాయంగా నిద్రాహారాలు మాని కంటికి రెప్పలా నన్ను కాపాడిన ఆయన పవిత్ర ఆత్మీయతకు వూరువూరే ముక్కు మీద వేలేసుకుంది. కానీ యీ వాస్తవాల నన్నిటినీ కూడకట్టుకొని నామీద దండయాత్ర చేయడం మాత్రము నాకు బాధకల్గించింది. మా సంభాషణంతా వింటూ కూర్చున్న మా వదిన యిప్పుడు కలుగజేసుకుంది.

"ఎందుకండీ! యింత రాద్ధాంతము? ఆడపిల్ల కాబట్టి అడిగింది. అంతమాత్రానికే యింత యిదవాలా?!

"ఆడపిల్ల కాబట్టేనే యింత యిదయ్యేది! ఈ 'ఆడ'పిల్లలున్నారు చూశావూ? వీళ్ల పుట్టింటినంతా గంపకెత్తుకొని అత్తింటికి చేర్చాలంటారు."

"వదిన కూడా ఒకప్పుడు ఒకింటి ఆడపిల్లే" అన్నాను యీ అవకాశమును వదులు కోగూడదని.

వెంటనే అందుకున్నాడు అన్నయ్య - "దానికేం తెలుసు. ఒట్టి వెఱ్ఱిబాగులది. నీ మాత్రము తెలివితేటలుంటేనా?... వాళ్ళన్నయ్య జందెముతో సహా తెంచుకొచ్చేది"

"నేనంత ఆశపోతురాలనంటావురా అన్నయ్యా! సరే. నీది ఒక్కనయాపైస కూడా నాకొద్దు. నీవే మేడమీద మేడగట్టుకొని పదికాలాలపాటు సుఖంగా జీవించు" అన్నా లేచిపోతూ.

వదిన చెయ్యి పట్టుకొంది.

"ఆడపిల్ల కంట తడిపెట్టకూడదండీ! మీరు చెపితే వినరు" అంతవరకు నాకు తెలియదు...

**పిడుగు పాపిరెడ్డి**

**పాతబంగారం**

కంట నీరు పెట్టుతున్నానని.

"అది నా సొంత చెల్లెలంటే... కంట నీరు పెట్టకుండా చూచుకోడానికి? నేనేదో వూర కుండలేక వురేసికొన్నట్లు దాని జేజినాయన, మా జేజినాయన ఎక్కడో కలిశారని ఆ బాంధ వ్యపు పోగు పట్టుకొని వూగులాడాను యింత కాలమూను. ఇంకలా వూగులాడే శక్తి, ఓపిక నాలో లేవు".

నా శరీరంలో రక్తమంతా గడ్డకట్టుక పో యింది. అన్నయ్య అంతమాట అంటాడని కలలోగూడా అనుకోలేదు. ఇక చస్తే ఆ యింట్లో అడుగు పెట్టగూడదని నిర్ణయించు కున్నాను. వదిన పట్టును విడిపించుకొని ఒక్క ఉదుటున వీధిలోపడి యిల్లు చేరాను.

* * *

ఏ యింట్లో జీవితాంతమూ కాలు పెట్ట కూడదని నిన్న నిశ్చయించుకొని వెళ్ళిపోయానో ఆ యిల్లే నా జీవిత దేవాలయానికి గర్భగుడి అని యీరోజు తెలిసికొన్నాను. మేడమీద మేడ కట్టి పదికాలాలపాటు సుఖంగా జీవించమని నిన్నేమో దీవించాను. కానీ ఆ ఉన్న ఒక్క కొంప గూడ వాళ్లకు దక్కించలేకపోయానని యివాళ తెలిసికొన్నాను.

అక్కడి ప్రతివ్యక్తితోనూ బాల్యము నుండి పెంచుకొన్న సంబంధ బాంధవ్యాలను తెంచు కొని అత్తింటికి వెళ్ళడానికి నిర్ణయింపబడిన సుముహూర్తమది. ఈ విషాద సంభరిత ప్రశాం త సుముహూర్తానికి స్మృతిచిహ్నంగా మా అన్నయ్య తెచ్చిన కానుక నేను వూహించినదాని కంటె గూడా గొప్పది. నన్ను ఏడిపించాలనే వుద్దేశ్యముతోనే నిన్నలా నాటకమాడారు. ఆఖ రుకు నేనే ఓడిపోయాను. నేను కోరకముందే మా అన్నయ్య తన బాధ్యతను గుర్తించి, తన శక్తికి మించిన కానుకే తెచ్చాడు. అది ఒక హారము. ఆరేండ్ల వయస్సులోవున్న మా అన్న య్య ఫొటో ఒకటి యీ హారానికి అమర్చబడిన లాకెట్టులో యేర్పాటు చేశారు.

మా వదిన యీ హారాన్ని నాకు ధరింప జేస్తున్నప్పుడు నాలో కలిగే ఆనంద సంరం భము చూచి హాయిగా నిశ్వసించాలని మా అన్నయ్య చూపే ఆతృత నాకర్థమైంది. కానీ యీ అమూల్య కానుక జన్మకథ నాస్మృతిలో

అన్నాచెల్లెళ్ల అనురాగం, అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపించే ఈ కథ 'అసలు ఫాయిదాలు' 43 సంవత్సరాల క్రితం వ్రాయ బడింది. అప్పట్లో ఒక కళాశాల మేగజైన్‌లో మాత్రం ప్రచురించబడిన ఈ కథా రచయిత శ్రీ పిడుగు పాపిరెడ్డి.

వృత్తిరీత్యా ప్రధానోపాధ్యాయులుగా పని చేసి, రిటైరైన శ్రీ పాపిరెడ్డి సాహిత్యం, సంగీ తం, సామాజిక సేవ పట్ల మక్కువ కలిగి, అనేక బహుమతులు, ప్రోత్సాహకాలు, అవా ర్డులూ అందుకున్నారు. ఈయన రచనలు – 40 కథలు, 70 కవితలు వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, యువ, నేటినిజం, చినుకు, పత్రిక, ఆకాశిక్ వంటి పత్రికలలో తమ రచ నల ద్వారా పాఠకులకు సుపరిచితులు అయిన పాపిరెడ్డి 2007 ఆంధ్రభూమి ఉగాది కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందా రు. 'ఇంద్రనీలాలు' పేరుతో వీరి కథలు 'కథాసంపుటి'గా కూడా వెలువడ్డాయి.

ప్రస్తుత కథ 43 సంవత్సరాల క్రితమే వ్రాయబడినప్పటికీ కథ చదువుతూంటే ఇది పాతకథ అనే భావమే కలగకపోవడం ఈ కథ ప్రత్యేకత.

మెదిలేసరికి నా హృదయములోని ఆనందము కాస్తా కర్పూరంలా కరిగిపోయింది. తన నాలుగు అంకణాల దాబాను కుదవపెట్టి తెచ్చిన యీ కానుక నాకు సమర్పించి నా ఆనందము కోసము ఎదురుచూస్తున్నాడు అన్నయ్య.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయ్ "ఆ జబ్బునాడే చచ్చిపోతే ఎంత బాగుండేదిరా అన్నయ్యా!" అన్నాను రుద్ధమైన కంఠస్వరంతో.

"తప్పు తల్లీ! ఈ శుభ సమయాన అలా అనకూడదు" అంది వదిన.

"ఎందుకే ఏడుస్తావు? నేనేమీ భగవంతునికి అపకారము చేయలేదు శారదా! నా సోదరస్థానాన్ని ఆయనెందుకు లాక్కుంటాడు" అన్నాడు అన్నయ్య గంభీరంగా.

కంఠములో వణుకువున్నా కాస్త కర్కశంగానే అన్నాను – "నీ సోదరస్థాన ఔన్నత్యానికి మిమ్ములను మీరు బలిపెట్టుకుంటున్నారన్నయ్యా! అంతా అయిపోయాక ఆ సోదరస్థానము మిమ్ములనేమీ వుద్ధరించదని మీరు గుర్తించడం లేదు".

"అలా అనబోకు తల్లీ! మాకున్నదల్లా నీకేదో ఒక విధంగా ఉపయోగపడాలనే మా ఆశ. ఆరాటమూను" అంది వదినె.

నా హృదయములోని విషాదము కట్టలు తెంచుకొంది.

"నీవు దేవతవు వదినా!"

"మరి నేనో?" అన్నాడు అన్నయ్య కొంటెగా.

అంత విషాధభరిత వాతావరణములో గూడ అన్నయ్య చూపే సంయమమునకు ఆశ్చర్యపోయాను.

నా ప్రయాణానికి సర్వము సిద్ధమైంది. ఇక బయలుదేరడమే ఆలస్యము. "అన్నయ్యా మీ ఋణము..." కంఠము పూడుకపోయింది. పొంగుతున్న కన్నీరును ఆపుకోలేకపోయాను.

"ఋణము ఋణమని నీళ్లు నములుతావేమే. అప్పు వదులుకునేంత అమాయకుడు కాదులే మీ అన్నయ్య. అవసరమొచ్చినప్పుడు అసలు ఫాయిదాలతో సహా వసూలు చేస్తాడు. తెలిసిందా?" అన్నాడు అన్నయ్య.

"అంత అదృష్టము నాకు కలిగేట్టు ఆశీర్వదించరా అన్నయ్యా!" అన్నాను అతికష్టంమీద.

జరగాల్సిన తతంగమంతా జరిగి, మేము స్టేషను చేరేసరికి రానేవచ్చింది రైలు. అతి ప్రయాసతో అన్నయ్య మమ్మల్ని ఒక ప్రక్క ప్రశాంతంగా కూర్చుండబెట్టగలిగాడు. నాతో పాటు మా అమ్మ, తమ్ముడు వస్తున్నారు. మా వారు నా ప్రక్కగా కూర్చున్నారు.

మా అన్నయ్య హృదయంలో అగాధవిషాద సాగరాలు ఉప్పొంగుతున్నాయని నాకు తెలుసు. ఆ కల్లోలాన్ని ఆయనిక ఏ మాత్రము సహించలేరు. ఆ బాధ నుండి తప్పించుకోవాలని విశ్వప్రయత్నము చేస్తున్నారు. మావారి వైపు చూచి "ఏమోయ్ గోపాలం! మా అమ్మాయి నాతో తగులాడి తగులాడి బాగా తర్ఫీదైంది. నీవు దానితో ఏమాత్రము తగవుకు సిద్ధపడ్డా చిక్కుపడవలసి వస్తుంది జాగ్రత్త!" అన్నాడు.

"అంతవఆకువస్తే మీసహాయమర్థిస్తాలెండి. అవసరమొచ్చినప్పుడు ఆదుకోడానికి మీరు తప్పకుండా రావాలి" అన్నారు మావారు పరోక్షంగా ఆహ్వానిస్తూ.

రైలు బయలుదేరడానికి సమయమైంది.

మా అన్నయ్య నాదగ్గరకు వచ్చి నాచేతిని తన చేతిలోకి తీసికొని నాముఖంలోనికి తదేకంగా చూస్తున్నాడు. ఏదో చెప్పాలని ఆయన పెదవులు కదిలాయి. శబ్దము మాత్రము రాలేదు.

కపోలాలపై జారే కన్నీటిని తుడుచుకుంటూ అన్నాను "ఒరే అన్నయ్యా! నాతో తగవులాడినందుకు తగినశాస్తి చేశాను చూశావా? నీకు నిలువనీడ లేకుండా చేసి మరీ వెళుతున్నాను. ఇంకెప్పుడూ యిలాంటి తగవులు మరెవ్వరితో కూడా పెట్టుకోబోకు".

"అంత అదృష్టము యింక ఈ జీవితానికి రాదులేవే" అన్నాడు శూన్యములోకి చూస్తూ.

నాకు ఆఖరిసారి వీడ్కోలు యివ్వడానికా అన్నట్లు ఆయన కనుకొలుకుల్లో రెండు కన్నీటి కణాలు వచ్చి నిలిచాయి.

నా జీవితములో ఆయన నేత్రాంచలముల చూచిన మొట్టమొదటి కన్నీటి కణాలు అవే.

* * *

మా అత్తవారి వూరు బెజవాడ దగ్గర ఒక చిన్నపల్లె. మావారు వ్యవసాయముతోపాటు వ్యాపారముగూడా చేసేవారు. భగవదనుగ్రహమువల్ల మా స్థితి లక్షలకు దాటింది. మా పరిస్థితి అన్నివిధాలా సంతృప్తికరంగావుంది. మా అన్నయ్య దగ్గరనుండి వారానికో వుత్తరము వస్తుంది. ఒక వుత్తరములో వదినెకు మూడో నెల అని వ్రాశాడు. మా అనందానికి హద్దుల్లేవు.

సకల సంపదలతో తులదూగుచున్న మా సంసారానికి సంతానలేమి ఒక గొప్ప లోపంగా పరిణమించింది. ఏ పూర్వపుణ్యఫలమో ఆ లోపాన్ని గూడా సవరించి భగవంతుడు మా సంసారాన్ని అష్టైశ్వర్యములకు నిలయము చేశాడు. కానీ ఆ తర్వాత ఆయన మస్తిష్కము చురుకుగా పనిచేసినట్లుంది. అనుకున్నదానికంటే అతిగా ప్రసాదించాననుకున్నాడేమో వెంటనే ఒక్కొక్కదాన్ని వుపసంహరించుకోవడం ప్రారంభించాడు.

లేకలేక కల్గిన ఏకైక పుత్రుడు ఇహలోకాన్ని విడిచాడు. ఈ అఘాతానికి తట్టుకొని నిలబడక ముందే మరొక అఘాతము ఎదురైంది. అప్పటి వఱకు అన్నయ్య దగ్గర నుండి అంచెలంచెలుగా వస్తున్న ఉత్తరాలు హఠాత్తుగా ఆగిపోయాయి. తర్వాత వ్రాసిన రెండు జాబులకూ జవాబు లేదు. అన్నయ్య గురించి పూర్తి వివరాలు తెల్పమని మా భాస్కరమన్నయ్యకు ఒక జాబు వ్రాశాము. వారము రోజులలో జవాబు వచ్చింది. ఎంతో ఆత్రంగా విప్పిచూశాను - చదివి, స్థంభించిపోయాను. నాకు స్మృతి వచ్చేసరికి మావారు నా భుజము పట్టుకొని వూపుతున్నారు. ఉత్తరము ఆయన చేతిలో వుంది. ఆయనగూడా చదివేరు కాబోలు ముఖమంతా పాలిపోయివుంది.

మా అన్నయ్య ఆస్తి తాకట్టు క్రింద జప్తు అయింది. ఈ అవమానాన్ని భరించలేక ఆ అభిమాని నిండు చూలాలితో ఏ దూరతీరాలకో వెళ్లిపోయాడు.

ఈ పరిస్థితికంతా నీవే కారణమని నా అంతరాత్మ నిలేసి అడుగుతూంది. మా అన్నయ్య వాత్సల్యభరిత మోములోని కనుగొలుకుల్లో నిలిచిన ఆ కన్నీటి కణాలు "నీవెంత మాత్రము కాదు తల్లీ! అందుకు మేమే సాక్ష్యమని అభయహస్తమిస్తున్నాయి". మాకున్నయింత సంపదకూడ అన్నయ్యకు అక్కరకు రాలేదే అని మేము ఎంత కుమిలిపోయామో ఆ భగవంతునికే తెలుసు.

అన్నయ్య జాడకొఱకు మేము చేయని

ప్రయత్నమంటూ లేదు. అన్నిటా మాకు నిరాశే ఎదురైంది. ఈ అఘాతాలతో మా జీవనతంత్రులు కొంత బలహీనపడ్డాయి. ఏదో వుదాసీనత మా మనస్సుల మీద సవారి చేస్తూంది. ఈ సమయములోనే మాకు నీల పుట్టింది. నిస్సారమైన జీవితంలో ఆనందాన్ని వెదుక్కుంటూ పది హేమంతాలు గడిపాము. ఒకనాటి వుదయము విధివక్రించి నా సౌభాగ్యమును తుడుచుకు పోయింది... యీ వ్యర్థసంపదను, పదేళ్ళ పాపనూ నా పాలిటి వదిలిపెట్టి. అయినా భగవంతుని నిందించలేను. అర్థించకున్నా ఆదరించాడు. అపరాధము లేకున్నా శిక్షించాడు.

ఈ విశాల విశ్వములో నేకోరదగినదేమీ లేదు - ఒక్క అన్నయ్య దర్శనము తప్ప. అందు కోసమే జీవించి వున్నాను. అన్నయ్యను కలుసుకుంటాననే ఆశ నా హృదయములో నశించక ముందే భగవంతుడు నాకేదో మార్గము చూపకపోడనే ఆశతోనే జీవిస్తున్నాను.

* * *

"ఇదీ కామేశబాబూ!" నా కథ అంది శారదమ్మ గారు. శారీరక బలహీనతతో పాటు గతస్మృతులను జ్ఞాపకము చేసికోవడంతో పూర్తిగా అలసిపోయింది.

ఇప్పటివరకూ కథలో నిమగ్నమైన నా మనసు ఇప్పుడు ఆలోచించడం ప్రారంభించింది. యాభైఏండ్ల సుదీర్ఘ జీవితంలో తనకు ఎదురుపడిన అనేక అనుభవాలు, అనుభూతుల మధ్య గుప్తధనంలా దాచుకొనిన మూలధనం లాంటి తన అన్నయ్య మధురస్మృతి తాలూకు ప్రతిమాటా, ప్రతిచేష్ట ఆమె మస్తిష్కములో తిష్ఠవేసుకు కూర్చున్నాయి. అందుకే ఆ సంఘటనలనట్లా తడుముకోకుండా చెప్పగలిగింది. అయితే ఆమె అంతిమ ఆశ నెరవేరుతుందన దములో నాకు అనుమానము లేకపోలేదు.

"ఈ జీవితములో మీ అంతిమ కోర్కెను ఆ భగవంతుడు తీర్చకపోతేనో?" అన్నాను.

ఆమె కన్నుల్లో ఒక వింతకాంతి గోచరించింది. "అంతటి భయంకరమైన శిక్ష భగవంతుడు వెయ్యలేడు బాబూ!" అంది ఎంతో విశ్వాసముతో.

## గుంటూరులో శతాధిక మహిళా కవి సమ్మేళనం

ఏప్రిల్-27, 2008న గుంటూరులో జరుగనున్న శతాధిక మహిళా కవి సమ్మేళనంలో పాల్గొనవలసిందిగా సాహిత్యరంగంలో కృషిచేస్తున్న మహిళలను 'గుంటూరు జిల్లా రచయితల సంఘం' ఆహ్వానిస్తోంది.

వచన కవిత్వం లేదా పద్యాలతో ఈ కవి సమ్మేళనంలో పాల్గొనదలచినవారు ముందుగా తమ రచనలను నిర్వాహకులకు పంపించాలి. 20 లైన్లకు మించని వచన కవితగాని, మూడు పద్యాలుగానీ పంపించవచ్చు. రచనలు తమ స్వంతమేనని, ఎక్కడా ప్రసారం/ప్రచురణ కాలేదని హామీపత్రం వ్రాసి జతచేయాలి. తమ పూర్తి చిరునామా, ఫోన్ నెంబరూ తప్పక ఉదహరించాలి. సమ్మేళనంలో పాల్గొన్నవారందరినీ జ్ఞాపికతో సత్కరిస్తారు. రచనలు మార్చి 31వ తేదీ లోపుగా శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య, అధ్యక్షులు, గుంటూరుజిల్లా రచయితల సంఘం, కేరాఫ్ ఆర్.డి.ఓ. కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, గుంటూరు - 522 004 అనే చిరునామాకు పంపించాలి. ఇతర వివరాలకు సంఘ కార్యదర్శి శ్రీ కోసూరి రవికుమార్ (98858 51576) గారిని సంప్రదించవచ్చు.

నీల ఆమె ప్రక్కనే కూర్చుని విసనకర్రతో విసరుతూంది. ఆమె యిప్పుడు పెద్దదైంది - యౌవనము తన లావణ్యాన్ని వికసింప జేస్తుంది. క్రొత్తజీవితంలో అడుగుపెట్టటానికి సిద్ధంగావుంది.

"నీలను గురించి మీరేమీ చెప్పనేలేదే" అన్నాను ఏమి చెప్తుందోనని. "అన్నయ్య దర్శనంతోనే నీల జీవితం ముడిపడివుంది బాబూ. వియ్యంకుడు లేంది మనమేమి చెయ్యలేము గదా!" అందామె.

ఆమె భావము నాకర్థమైంది.

"ఆయనకు కొడుకు లేకపోతేనో?" అన్నాను. నావైపు నిశితంగా చూస్తూ అంది ఆమె "కొడుకు వుండకపోతే మా నీల కన్యగానే వుంటుంది".

అకారణంగా ఆమె అంత విశ్వాసాన్ని పెంచుకోదని నాకు తెలుసు. నీల మాత్రము అతీతంగా నిశ్చలంగానే వుంది ఈ విషయం తనది కాదన్నట్లుగా.

"అన్నయ్య కనిపిస్తే మాత్రము నాకొకసారి తప్పకుండా చూపాలి" అన్నాను.

"అఁ తప్పకుండా బాబూ -" అంటూ లేచిందామె నీల సహాయంతో. చెరొకవైపు పట్టుకొని మెల్లగా ఆమెను రూములోనికి చేర్చాము.

ప్రక్కవేసికొని పడుకున్నానేగాని, ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు. ఆప్యాయత, ఆర్ద్రత రూపుదాల్చిన శారదమ్మగారి శుష్క వదనము నా దృష్టిపథము నుండి తొలగిపోవడంలేదు.

ఆమెతో నా పరిచయము కూడ చాలా విచిత్రంగా జరిగింది. మా కాలేజి వార్షికోత్సవ సందర్భాన మేము వేసిన నాటకములో నాతో పాటు నీల కూడా నటించింది. ఆ పరిచయముతో నీల నన్ను వాళ్ళింటికి ఆహ్వానించిందొక రోజు. శారదమ్మగారు ఆచారము మేరకు ఎంతో ఆదరము చూపింది. కానీ యిలాంటి వ్యవహారము ఆమెకు నచ్చదనే విషయము ఆమె ముఖభంగిమనుబట్టి నేను స్పష్టముగా గ్రహించాను.

మరుసటిరోజు వుదయము అనుకోకుండా ఆమె నా గదికి వచ్చింది. ఆదరపూర్వకంగా ఆహ్వానించి కూర్చోమని కుర్చీ చూపించాను. కూర్చుంది. ఆమె గంభీర ముఖముద్రనుబట్టి ఆమె ఎందుకు వచ్చిందో గ్రహించగలిగాను. రూమునంతా ఒకసారి తేరిపారచూస్తూ "చూడుబాబూ...!" అంటూ ఏదో చెప్పబోయి తటాలున ఆగిపోయింది. నేను తలెత్తి చూశాను. గోడలకు వ్రేలాడుతున్న ఫోటోలను తదేకంగా చూస్తూంది. నా వైపుకు దృష్టిని మళ్ళిస్తూ, "నేనీరూములో ఒక ఐదునిమిషాలు విశ్రాంతి తీసుకోవచ్చా నాయనా?" అని అడిగింది. సరేనంటూ తలుపు అడ్డమేసి నేను బజారుకుపోయాను. వచ్చేసరికి ఆమె కుర్చీలో కూర్చొని ఏదో ప్రశాంతంగా ఆలోచిస్తోంది. నన్ను కూర్చోమని నా వివరాలన్నీ అడిగి తెలుసుకొంది. ఎంత హుందాగా ప్రవర్తించినా నా పేదరికాన్ని మాత్రము దాచలేకపోయాను. నా చదువు యితరుల దయాదాక్షిణ్యాలమీద సాగుతోందని ఆమె యింతకుముందే తెలుసుకుంది. అమ్మ చనిపోయిందని చెప్పినప్పుడు ఆమె అతికష్టం మీద కన్నీటిని ఆపుకుంది. ఆమె ఎంతో అనునయంగా నన్ను తన యింట్లోనే వుండిపొమ్మని బలవంతపెట్టింది. నేను ఎంత చెప్పినా ఆమెకు నచ్చచెప్పలేకపోయాను.

ఇక చేసేదిలేక నా సామానుతో ఆమె విశాల మైన బంగళాలో నాకు కేటాయించిన ఒక అందమైన చిన్నగదిలో మకాము పెట్టాను.

శారదమ్మగారు నా గదిలో గంటలతరబడి గడిపేది. మాటామంతి లేకుండా నిశ్చల నిరీహ నేత్రాలతో శూన్యంలోకి చూస్తూ అనేక రోజులను కాలగర్భంలో కలిపేసింది. నేను యిక్కడకు వచ్చినదగ్గర నుండి ఆమె ఆరోగ్యము క్రమేపీ క్షీణించ మొదలుపెట్టింది. ఆమె కావా లనే తన ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటుందేమో నన్న అనుమానము నాకు కలిగింది. ఎంతో ప్రయత్నించి కూడా ఆమెను గురించి ఒక్క సంగతీ నేను తెలిసికోలేకపోయాను.

ఒకరోజు రాత్రి నేను చదువుకోడానికి సిద్ధమౌతుండగా, నీల సహాయంతో ఆమె నా రూములోనికి వచ్చింది. కుర్చీలో కూచుంటూ, "నాకథ చెపుతా వింటావా బాబూ!" అంది. ఆమెకై ఆమె యీ ప్రస్తావన తీసుకరావడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. పుస్తకాలన్నీ సర్దేసి వినడానికి సిద్ధపడ్డాను. ఒక్క కన్నీటి బొట్టును గూడ రాల్చకుండా, ఒక్క దీర్ఘనిశ్వా సముగూడ విడవకుండా, ఎంతో విషాదకర మైన సంఘటనలతోగూడ అతి సహజంగా తన ఆత్మకథను పూర్తిచేసింది. ఇలా ఆలోచించు కుంటూ ఎప్పుడు నిద్రపోయానో తెలియదు. ఉదయము లేచేటప్పటికి ప్రభాత సూర్యుడు తన సప్తాశ్వాలను జోరుగా తోలుతున్నాడు.

అనంత కాలవాహినిలో ఒక నెలరోజులు గడిచిపోయాయి. శారదమ్మగారు మరణ శయ్యపై రోజులు లెక్కిస్తున్నారు. ఆమె ఆరోగ్యా నికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాము. డాక్టర్లు వచ్చిపోతున్నారు. మందుసీసాల సంఖ్య వందలకు దాటింది. ఫలితము మాత్రము శూన్యము.

ఈరోజు అనేది ఒకటి లేకపోతే శారదమ్మ గారి జీవితం అర్థరహితంగా అంతమయ్యేది. నీల మందు త్రాపింది. ఇద్దరమూ మెల్లగా ఆమె ను పడుకోబెట్టాము. మా యిద్దరినీ తనదగ్గరకు పిలిచింది. నిదానంగా మా ముఖాలవైపు చూస్తూ ఏమాలోచించుకుందో తెలియదు కాని, ఆమె ఒక నిశ్చయానికొచ్చినట్లు మాత్రము స్పష్టమైంది.

"అన్నయ్యను చూస్తారా బాబూ!" అంది హఠాత్తుగా. మేమిద్దరమూ విస్తుపోయాము.

"ఎక్కడ?" అన్నాము ఆత్రుతగా. దిండు క్రింద నుండి ఒక చిన్న పెట్టెని తీసింది. అందులో ఒక హారముంది. దాని లాకెట్టు తెరిచి ఒక ఫోటో చూపింది. నిరుత్సాహంగా చూశామిద్దరమూ.

"అన్నయ్య అప్పుడిట్లా వున్నారు?"అంది ఆమె.

"మరి యిప్పుడో?" అంది నీల అనుకో కుండా.

"ఇప్పుడలా వుంటారు" అంది ఎదురుగా గోడకు వ్రేలాడుతున్న ఫోటోచూపి.

"మా నాన్న!" అన్నాను అప్రయత్నంగా.

"అవును. మీనాన్నే మా అన్నయ్య" అందా మె అతి సహజంగా.

* * *

కళ్ళద్దాలు మరొకసారి సవరించుకున్నాడా వృద్ధుడు. తన కుమారుడు వ్రాసిన సుదీర్ఘమైన ఉత్తరమును పూర్తిచేయడంలో ఆయన నేత్రాం చలముల నుండి కారే కన్నీరు ఏమాత్రము సహాయకారి కాలేదు. ఆ సహాయ నిరాకరణను ప్రతిఘటించటంలో వృద్ధుడు పూర్తిగా అశక్తు

డైనాడు. ఆఖరుకు అశ్రుసిక్త నేత్రాలతోనే చదువసాగేడు.

*"నాన్నగారూ! ఈ రోజు ఈ సంఘటన జరగకపోతే యింత పెద్దవుత్తరము వ్రాయవలసిన అవసరము వుండేదికాదు. తన అంతిమ అభీష్టసిద్ధి అన్వేషణలో మీ ముద్దుల చెల్లెలు మృత్యువుతో హోరాహోరి పోరాడుతూంది. ఈ పోరాటములో ఆమె పూర్తిగా ఓడిపోకముందే ఒక్కసారి యీ అభాగ్యురాలికి మీ దర్శన భాగ్యము కల్గించడంలో ఏమీ అభ్యంతరముండ దనుకుంటాను.*

*నా సాహసాన్ని మన్నించమని కోరుతూ – శతాధిక వందనములతో.*

*మీ కుమారుడు*
*కామేశం*

అద్దాలు తొలగించి కన్నీళ్లు తుడుచుకున్నాడా వృద్ధుడు. ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివాడో, ఎంతసేపు ఏడ్చాడో ఆయనకు గుర్తులేదు. వెంటనే బయలుదేరి వెళ్లాడు.

వాకిట్లోనే కుమారుడు కన్పించి, "నాన్నా!" అంటూ బావురుమన్నాడు. కుమారుని చేయి మృదువుగా నొక్కి వదలిపెట్టాడు వృద్ధుడు. అతని సహాయంతో శారద దగ్గరకు వెళ్ళాడు. తోలు కప్పుకున్న ఒక ఎముకలగూడు చూచి స్థాణువులా నిలబడిపోయాడు. తన చేతులలో పెరిగి, పెద్దదై, రూపురేఖలు దిద్దుకున్న శారద యీనాడు యీ రూపములో సాక్షాత్కరిస్తుందని ఆయన ఏనాడూ వూహించి వుండడు. అరవై ఏండ్ల పూజారి జీవితములో తను చేసిన సేవను భగవంతుడు స్వీకరించలేదని యీరోజు తెలుసుకున్నాడు.

నిదానంగా మంచము దగ్గరకెళ్లి శారద ప్రక్కన కూర్చున్నాడు. పొంగుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, వణుకుతున్న చేతితో శారద శిరమును నిమిరాడు. ఏ శీతల హస్త స్పర్శ కోసము ఆ ఎముకలగూడు యిన్నాళ్లు ఎదురు చూసిందో, ఆ స్పర్శ సోకగానే గత రెండు రోజుల స్మృతినుండి మేల్కొంది. కళ్లు తెరిచి ఎదుటనున్న విషాదమూర్తిని చూసింది. బొక్కి నోరు, చప్పిదవడలు, పీక్కుపోయిన కండ్లుగల ఆ కపాలములో తన గతజీవిత మధురస్మృతికి ఆధారభూతమైన ముఖ లక్షణాలను కనుగొని, "అన్నయ్య" అంది అస్పష్టంగా. ఆమె ముఖసీమలో ఆనందము, ఆశ్చర్యము, అభిమానము, అసహనము యిలాంటి సవాలక్ష భావాలు తృటికాలములో దొర్లిపోయాయి. యుగయుగాల తపఃఫలాన్ననుభవిస్తున్నట్లు తృప్తిగా నిశ్వసించింది.


"నీ అన్నయ్యకు యింత ఘోరమైన శిక్ష విధించావేమమ్మా శారదా?" అన్నాడాయన కన్నీట తడిసిన పెదాలతో.

అన్నయ్య దర్శనముతో ఆమె నీరసదేహములో చైతన్యము ప్రసరించింది. ఎండిపోయిన పెదాలపై చిరునవ్వు తెచ్చుకోడానికి వృథా ప్రయత్నము.

"నీవు మాత్రము తక్కువ తిన్నావురా అన్నయ్యా! నీ శారదను గొప్పయింటి బిడ్డను చేసి. ఆమెపైగల సర్వాధికారమును వదులుకొని. నన్ను మాత్రము శిక్షించలా!" అంది బలాన్నంతా కూడదీసుకోడానికి ప్రయత్నిస్తూ.

"నా అపరాధాన్ని నీవు క్షమించలేవని తెలుసమ్మా! కానీ ఆ ఆపరాధానికి శిక్ష యింత భయంకరంగా వుంటుందని మాత్రము తెలియదు" అంటూ వాపోయాడా వృద్ధుడు.

"నీ శిక్ష యింతటితో తీరిపోలేదురా అన్నయ్యా! నీవు చేసిన తప్పులు చాలా వున్నాయి




అవసరమొచ్చినప్పుడు అసలు ఫాయిదాలతో సహా వసూలుచేసుకుంటానని మాటిచ్చావు ఆరోజు. ఆ మాట నిలబెట్టుకొంటావేమోనని ఎదురు చూశానిన్నాళ్ళూ. కానీ నా ఆశ నిరాశే అయింది. ఇంకా వుపేక్షిస్తే లాభంలేదంటూ, ఆమె ఒక్కవుదటన లేచి కూర్చుంది. కామేశం ఆమెను పడకుండా పట్టుకున్నాడు. నీల ప్రక్కనే వుంది రూపుదాల్చిన శోకమూర్తిలా. గ్రుడ్లప్ప గించి చూస్తున్నాడు వృద్ధుడు. కారే కన్నీటిని తుడుచుకోవడం గూడ మరచిపోయి.

శారదమ్మ తన తలదిండు క్రింద వున్న ఆనాటి హారము తీసి వృద్ధునివైపు చూపి, "ఇదిగో అసలు" అంది. నీలను చూపి "ఇది వడ్డీ" అంటూ ఆ హారాన్ని నీలమెడలో వేసి, నీల చేతిని కామేశం చేతిలో కలిపి, రెండు చేతులూ వృద్ధుని చేతుల్లో పెట్టింది.

"ఇప్పటికి నీ అపరాధానికి తగిన శిక్ష విధించానురా అన్నయ్యా!" అంది ఎంతో తృప్తిగా. బొందెతో కైలాసముపోయినా ఆమె కింత సంతోషము కలిగేదికాదేమో. వృద్ధుడు కరిగి నీరైపోయాడు.

"ఋణము పూర్తిగా తీర్చడములో నీవు ఋణానుబంధాన్ని తెంపగలిగాననుకున్నావా శారదా?" ఆగి ఆగి ఆడే గడియారంలా ఆమె గుండె కొట్టుకుంటూంది. కన్నీరు తడిసిన మోములో కమనీయ దరహాసము తొంగి చూస్తూంది. కోల్పోబోతున్న స్మృతిని కూడగట్టు కొంటూ ఆఖరుమాట పలికింది.

"ఒరే అన్నయ్యా! నీ పిచ్చిగానీ మనము తెంపాలన్నా అది తెగుతుందిరా? మన యీ అనుబంధము జన్మ జన్మాంతరాల నుండి అనుస్రుతంగా వ...చ్చే...వ....ర...ం...".

మరి మాటలు లేవు.

"శారదా!" వృద్ధుని హృదయాన్ని చీల్చుకొని వచ్చిన చావుకేక భవనమంతా ప్రతిధ్వనించింది.

విశాల విశ్వాకాశములోని రెండు మానవ నక్షత్రాలు రాలిపోయాయి. ●